

అభివృద్ధికి ఊతం






- కేంద్ర బడ్జెట్‌పై సర్వత్రా హర్షాతిరేకాలు
- ప్రత్యేక ప్యాకేజీ కింద వెనుకబడిన జిల్లాకు సాయం
- సాగుకు ప్రోత్సాహకంగా కేటాయింపులు
- చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు తోడ్పాటు
- వేతన జీవులు, పెన్షనర్లకు ఊరట

(పార్వతీపురం/ గుమ్మలక్ష్మీపురం/ పాలకొండ)

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో తీవ్రంగా నష్టపోయిన రాష్ట్రాన్ని గట్టెక్కించేలా కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు చేయడంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రం విడిపోయిన తరువాత నవ్యాంధ్రప్రదేశ్‌కు ఊతమిచ్చే బడ్జెట్ ఇదేనన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఈ ఘనత టీడీపీ కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని, ప్రస్తుత బడ్జెట్ ఆంధ్రప్రదేశ్‌కు ఆక్సిజన్ లాంటిదని జిల్లావాసులు చెబుతున్నారు. మొత్తంగా లోక్‌సభలో మంగళవారం ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై సర్వత్రా సానుకూల స్పందన వస్తోంది. రాష్ట్ర అభివృద్ధికి తద్వారా ఉమ్మడి జిల్లా అభివృద్ధికీ ఆసరా లభిస్తుందని ఎక్కువ మంది అభిప్రాయపడుతున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ ద్వారా పార్వతీపురం మన్యం జిల్లాకు ప్రయోజనం కలగనుంది. నిరుపేద, పేద, రైతులు, యువత, మహిళల సంక్షేమమే లక్ష్యంగా బడ్జెట్‌లో కేటాయింపులు ఉన్నాయి. మౌలిక సదుపాయాలకు పెద్ద పీట వేశారు. నిరుద్యోగాన్ని తగ్గించే లక్ష్యంతో స్కిల్ డెవలప్ ట్రైనింగులు, మహిళల పేరిట ఆస్తులు కొనుగులు చేస్తే స్టాంపు డ్యూటీలో మినహాయింపు ఇచ్చారు. ప్రత్యక్ష పన్నుల విధానంలో చిన్న, చిన్న మార్పులు చేసినప్పటికీ, జీఎస్టీ విధానంలో ఎటువంటి మార్పులు చేయలేదు.

- చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఏర్పాటుకు ప్రోత్సాహం కల్పించేందుకు నిర్ణయించారు. ఈ శాఖకు సంబంధించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్ విజయనగరం జిల్లా వాసి కావడంతో ఉమ్మడి జిల్లాకు ప్రయోజనం కలిగే అవకాశం ఉంది.
- సోలార్ ప్లాంట్స్ ఏర్పాటుకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ప్రకటించారు.

అదేవిధంగా ముద్ర యోజన పథకం కింద ఇస్తున్న రుణ పరిమితిని రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంచారు. గ్యారెంటీ, థర్డ్‌పార్టీ లేకుండానే ఈ రుణాలు మంజూరు చేయాలని నిర్ణయించారు. దీనిపై నిరుద్యోగులు, వృత్తిదారులు, చిన్న వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



- గిరిజనుల సామాజిక ఆర్థిక పరిస్థితులు మెరుగుపరిచేందుకు కేంద్ర సర్కారు ప్రత్యేక పథకాన్ని తీసుకురానుంది. దేశవ్యాప్తంగా 63 వేల గ్రామాలను ప్రత్యేకంగా గుర్తించారు. వెనుకబడిన ప్రాంతంగా ఉన్న పార్వతీపురం మన్యం జిల్లా నుంచి కూడా కొన్ని గిరిజన గ్రామాలు ఈ పథకం కింద ఎంపికయ్యే అవకాశం ఉంది.
- ప్లాస్టిక్ ఉత్పత్తుల రేట్లు పెరగనున్నాయి.. ప్లాస్టిక్ ఉత్పత్తులపై కస్టమ్స్ డ్యూటీని 25 శాతానికి పెంచుతూ బడ్జెట్‌లో పేర్కొన్నారు.. అదే విధంగా కెమికల్స్, పెట్రోకెమికల్స్, పైనా కస్టమ్స్ డ్యూటీని ఇప్పుడున్న 10 శాతం నుంచి 15 శాతానికి పెంచారు. ఫెర్టిలైజర్లు, పురుగుల మందుల తయారీలో ఉపయోగించే అమ్మోనియం నైట్రేట్‌పై కస్టమ్స్ డ్యూటీని పెంచడంతో వాటిపై ధరలు స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది.
- రాజధాని నిర్మాణానికి రూ. 15 వేల కోట్లు కేటాయించడంతో పాటు స్టీల్ ప్లాంట్ అభివృద్ధికి రూ. 620 కోట్లును మంజూరు చేశారు. కొత్తగా విశాఖపట్నం - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. దీంతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి.
- కేన్సర్ మందులపై కస్టమ్స్ డ్యూటీ తగ్గింపువల్ల రోగులకు ఊరట లభించనుంది. బంగారం, వెండి, సెల్‌ఫోన్ల ధరలు కూడా తగ్గనున్నాయి. ఆదాయపు పన్ను మినిహాయింపుల్లో స్వల్ప మార్పులు చేశారు. రూ.3 లక్షల వరకు ఎటువంటి పన్ను ఉండదు. పెన్షనర్లకు ఇదే తరహా ఊరట కల్పించారు.
- 2014 నుంచి 2019 వరకూ వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ప్యాకేజీ కింద ఉమ్మడి జిల్లాలో అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పనకు కృషి జరిగింది. 2019 నుంచి 2024లో ఈ ఊసే లేదు.. తాజాగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించారు. మౌలిక సదుపాయాల కల్పనకు, వివిధ అభివృద్ధి పనులకు ఈ నిధులు ఉపయోగించుకోవచ్చునని బడ్జెట్‌లో పేర్కొన్నారు. ఈ అంశం పార్వతీపురం మన్యం జిల్లాకు ఎంతో మేలు చేస్తుంది.

చంద్రబాబు కృషి వల్లే...



ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కృషి వల్లే రాష్ట్రానికి రూ.15 వేల కోట్లు మంజూరయ్యాయి. అదేవిధంగా వెనుకబడిన జిల్లాలకు కూడా ప్రత్యేక ప్యాకేజీ లభించింది. అప్పట్లో ముఖ్యమంత్రి జగన్ కేసులు మాఫీ కోసమే ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు చేసేవారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు మాత్రం రాష్ట్రాభివృద్ధి కోసం ఢిల్లీ వెళ్లి ఫలితాలు సాధించారు. రాష్ట్రానికి నిధులు మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు.

-గుమ్మిడి సంధ్యారాణి, స్త్రీ శిశు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి

కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి ప్రాధాన్యం..



కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు మంచి ప్రాధాన్యం ఇచ్చారు. పోలవరం ప్రాజెక్టు, అమరావతి నిర్మాణం, వెనుకబడిన జిల్లాలు , ఉపాధి పరిశ్రమల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయడం గొప్ప విషయం. సీఎం చంద్రబాబు కృషి కారణంగానే రాష్ట్రానికి భారీగా నిధుల మంజూరయ్యాయి.

-తోయక జగదీశ్వరి, ఎమ్మెల్యే, కురుపాం

హర్షణీయం..



రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం రూ.15 వేల కోట్లు మంజూరు చేయడం హర్షణీయం. అదేవిధంగా వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించడం ఆనందదాయకం. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తామని పార్లమెంట్‌లో ప్రకటించడం అభినందనీయం. రాష్ట్ర ప్రగతి, ప్రజల సంక్షేమం కోసం సీఎం చంద్రబాబు ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వ పెద్దలను కలుసుకొని నిధులు మంజూరు చేసే విధంగా ప్రయత్నించారు. ముఖ్యమంత్రి కృషి మరువలేనిది.

-బోనెల విజయచంద్ర, ఎమ్మెల్యే, పార్వతీపురం

ఏపీకి పెద్దపీట..



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి పెద్దపీట వేయడం ఆనందదాయకం. ఐదేళ్ల తర్వాత కూటమి ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం బాసటగా నిలిచింది. రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన నిధులను సమకూర్చేందుకు కేంద్ర ప్రభుత్వం చొరవ చూపడం హర్షణీయం. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు కేంద్రంతో సత్సంబంధాలు మెరుగుపర్చుకోవడం కారణంగానే బడ్జెట్‌లో ఏపీకి అధిక ప్రాధాన్యం దక్కింది.

-నిమ్మక జయకృష్ణ, ఎమ్మెల్యే, పాలకొండ

గంజాయి నివారణే ధ్యేయం

- అక్రమ రవాణా, విక్రయాల కట్టడికి చర్యలు
- ఎస్పీ మాధవరెడ్డి వెల్లడి

గుమ్మలక్ష్మీపురం/కురుపాం/కొమరాడ, జూలై 23: జిల్లాలో గంజాయి నివారణే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. మంగళవారం గుమ్మలక్ష్మీపురం మండలం ఎల్విన్‌పేట పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి గంజాయి అక్రమ రవాణా, విక్రయాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా అక్రమంగా గంజాయి, నాటుసారా, మద్యం తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆ తర్వాత ఆయన కురుపాం, కొమరాడ పోలీసు స్టేషన్లను పరిశీలించారు. సత్వరమే కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై నిఘా ఉంచాలన్నారు. సరిహద్దు పోలీస్‌స్టేషన్లు కావడం వల్ల సిబ్బంది నిత్యం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ, కురుపాం, కొమరాడ ఎస్ఐలు షణ్ముకరావు, నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.



కొమరాడ పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ

తోటపల్లి పర్యాటకాభివృద్ధికి చర్యలు

- ఏవియేషన్ హబ్ ఏర్పాటుకు స్థల పరిశీలన
- జాయింట్ కలెక్టర్ శోభిక



సుంకి సమీపంలో ఏవియేషన్ హబ్ కోసం స్థల పరిశీలన చేస్తున్న జేసీ శోభిక, తదితరులు

గరుగుబిల్లి, జూలై 23 : తోటపల్లి ప్రాజెక్టు ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిత తెలిపారు. మంగళవారం ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న సుంకి రెవెన్యూ పరిధిలోని ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో తోటపల్లి ప్రాజెక్టుకు కొంతమేర భూముల సేకరించగా, కొంచెం ఖాళీ ప్రాంతం ఉందన్నారు. ఇప్పటికే కుడిమట్టికట్టకు ఆనుకుని బోటు షికారు, ఐటీడీఏ పార్కులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ ప్రాంతంలో ఏవియేషన్ హబ్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేస్తున్నామన్నారు. సుమారు రెండెక రాల ప్రాంతంలో హబ్ ఏర్పాటుకు ప్రతిపాద నలు చేస్తున్నట్లు చెప్పారు. నిర్మాణాలకు అవసర మైన నివేదికలను త్వరితగతిన అందించాలని తహసీల్దార్ కె.జయను ఆదేశించారు. సేకరించిన భూములు అన్యాక్రాంతం కాకుండా ఉండేలా చూడాలని సూచించారు. ఈ పరిశీలనలో పార్వతీపురం ఆర్డీవో కె.హేమలత, సర్వేయర్ బి.శ్రీనివాసరావు, ఆర్ఐ కృష్ణ, వీఆర్‌వోలు పి.రామకృష్ణ, ధనుంజయరావు, సర్వే సిబ్బంది వి.నాగరాజు తదితరులు ఉన్నారు.



శాకంబరిగా పోలమాంబ

ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత, భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లి శంబర పోలమాంబ మంగళవారం శాకంబరిదేవిగా దర్శనమిచ్చింది. ఆషాఢమాసం సందర్భంగా గ్రామంలో పెద్దమ్మతల్లితో పాటు చదురు, వనంగుడిలో పోలమాంబకు ప్రత్యేక పూజలు చేశారు. ముగ్గురు అమ్మవార్లను సుమారు 50 రకాల కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంత ప్రజలు పెద్దఎత్తున ఆలయానికి తరలివచ్చి.. అమ్మవార్లను దర్శించుకున్నారు. చీరలు, పసుపు కుంకుమలతో మొక్కులు చెల్లించుకున్నారు. ఈవో వీవీ సూర్యనారాయణ, ఆలయ తదితరులు పాల్గొన్నారు.

- మక్కువ

కుదమలో గజరాజులు

జియ్యమ్మవలస, జూలై 23 : జియ్యమ్మవలస మండలంలో కుదమ పంచాయతీలో గజరాజులు హల్‌చల్ చేస్తున్నాయి. గత నాలుగు రోజులుగా అక్కడే సంచరిస్తున్న ఏనుగులు రెండు ఎకరాల్లో మొక్కజొన్న , మరో మూడు ఎకరాల్లో వరి నాట్లు వేసేందుకు పెంచిన నారుమళ్లతో పాటు చెరకు పంటను ధ్వంసం చేశాయి. దీంతో రైతులు లబోదిబో మంటున్నారు. ఆస్తి, ప్రాణ నష్టం సంభవించకముందే.. అటవీశాఖాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి.. ఏనుగుల తరలింపు చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఆదేవిధంగా పంట నష్టపోయిన వారికి పరిహారం అందించాలని కోరుతున్నారు.



కుదమ ప్రాంతంలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

జీసీసీ సొసైటీ ఎన్నికలకు సిద్ధం

- గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన ప్రభుత్వం
- మార్గదర్శకాల తయారీలో సిబ్బంది

సీతంపేట: సీతంపేట జీసీసీ (గిరిజన సహకార కో-ఆపరేటివ్) సొసైటీ ఎన్నికలకు టీడీపీ కూటమి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో సంబంధిత అధికారులు ఎన్నికల నిర్వహణపై దృష్టి సారించారు. వాస్తవంగా గత తొమ్మిదేళ్లుగా సొసైటీ ఎన్నికలు నిర్వహించడం లేదు. ప్రత్యేక అధికారి నిర్వహణలోనే కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. దీంతో అభివృద్ధి పనులు చేయలేని పరిస్థితి ఏర్పడింది. సొసైటీ ఎన్నికలు నిర్వహించాలని గత వైసీపీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినప్పటికీ.. ఫలితం లేకపోయింది. ఎన్నికలు, సభ్యుల నియామకం లేక పోవడంతో రైతులకు ఖరీఫ్, రబీ పెట్టుబడి రుణాల చెల్లింపు కూడా నామమాత్రంగానే చేపట్టారు. వాటిని దృష్టిలో పెట్టుకున్న టీడీపీ కూటమి సర్కారు.. సొసైటీ పాలకవర్గ ఎన్నికలు నిర్వహించాలని అధికారులు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు చర్యలు చేపట్టేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. అసలు సీతంపేట సొసైటీ పరిధిలో 800 మంది వరకు గిరిజన రైతులు సొసైటీ సభ్యత్వం కలిగి ఉన్నారు. ఈ ఎన్నికల ద్వారా అధ్యక్ష, ఉపాధ్యక్షులు, సభ్యులను ఎన్నుకోనున్నారు. మొత్తంగా తొమ్మిదేళ్ల నిరీక్షణకు తెరపడడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై మేనేజర్ కృష్ణను వివరణ కోరగా.. ఎన్నికల నిర్వహణకు మార్గదర్శకాలు తయారు చేయాలని ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు.



సీతంపేట జీసీసీ కార్యాలయం

గృహ నిర్మాణ లక్ష్యాలను సాధించాలి

- అధికారులకు కలెక్టర్ ఆదేశం

పార్వతీపురం టౌన్, జూలై 23 : జిల్లాలో గృహ నిర్మాణాల విషయంలో వందరోజుల లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో హౌసింగ్ శాఖాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక వనరులను ఉపయోగించుకొని గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. వినూత్నంగా ఆలోచించి.. తక్కువ ధరలతో ఇళ్ల నిర్మాణం చేపట్టేలా చూడాలని సూచించారు. పీఎం జన్‌మాన్ కింద మంజూరైన 2,375 గృహాల నిర్మాణంపై దృష్టి సారించాలన్నారు. అవసరం మేరకు సచివాలయ సిబ్బందిని వినియోగించుకోవాలని తెలిపారు. పట్టాలున్న లబ్ధిదారులు గృహ నిర్మాణాలు ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఏకలవ్య పనులు వేగవంతం

మక్కువ: ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. మక్కువ మండలం అనసభద్ర గ్రామ సమీపంలో చేపడుతున్న ఏకలవ్య పాఠశాల భవన నిర్మాణాన్ని మంగళ వారం పరిశీలించారు. ఈ సందర్భంగా వంటగది, మరుగుదొడ్లు, డార్మెటరీ విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థుల కోసం అవసరమైన మంచాలు, ఫ్యాన్లు, కప్‌బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎర్ర సామంతవలసలో నడుస్తున్న ఏకలవ్య పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు చక్కటి బోధన అందించి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని టీచర్లకు సూచించారు. జాతీయ స్థాయిలో జరిగే పోటీల్లో విద్యార్థులు విజయం సాధించాలని ఆకాంక్షించారు. వనసభద్రలో ఆయిల్‌పామ్ క్షేత్రాలు పరిశీలించిన ఆయన వాణిజ్యపంటల సాగు దిశగా రైతులు అడుగులు వేయాలని సూచించారు. అంతర పంటలతో ఆర్థిక అభివృద్ధి సాధించొచ్చన్నారు. ఆ తర్వాత గ్రామస్థులతో మాట్లాడారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, వేడినీళ్లు తాగాలని తెలిపారు. ఆయన వెంట గిరిజన సంక్షేమశాఖ అధికారి జె.శాంతేశ్వరరావు, డీడీ ఎం.రుక్మాంగదయ్య, ఎంపీడీవో పి.దేవకుమార్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

రహదారులకు నిధులు మంజూరు చేయండి

● కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి



మంత్రి జనార్దనరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న జగదీశ్వరి

కొమరాడ/గుమ్మలక్ష్మీపురం: అంతర్ రాష్ట్ర రహదారుల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాల్సిందిగా రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డిని కురుపాం శాసన సభ్యురాలు తోయక జగదీశ్వరి వినతిపత్రాన్ని అందించారు. మంగళవారం వెలగపూడి సచివాలయంలో మంత్రిని కలిసిన ఎమ్మెల్యే సమస్యలను వివరించారు. పార్వతీపురం నుంచి కూనేరు వరకు ఉన్న 26 కిలోమీటర్ల రహదారిలో పూర్తిగా గోతులు ఏర్పడటంతో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. నాలుగు రాష్ట్రాలకు కీలకమైన ఈ రహదారి మరమ్మతులకు తక్షణమే నిధులు మంజూరు చేసి వాహనదారులకు ఇబ్బందులు తొలగించాలని కోరినట్లు ఫోన్‌లో ఆమె తెలిపారు. త్వరలోనే నిధులను విడుదల చేసి రహదారుల మరమ్మతులకు చర్యలు చేపడతామని మంత్రి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

గరుగుబిల్లి: పంచాయతీల పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని అధికారులను సర్పంచులు కోరుతున్నారు. పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా పర్యటిస్తున్న గ్రామాల్లో అధికంగా సమస్యలు వెల్లువెత్తుతున్నాయి. మంగళవారం గిజబలో వివిధ సమస్యలను సర్పంచ్ మండల భాగ్యలక్ష్మి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మండల శంకరరావు.. పంచాయతీ విస్తరణాధికారి ఎల్.గోపాలరావు దృష్టికి తీసుకువెళ్లారు. తోటపల్లి ప్రాజెక్టు నిర్వాసిత గ్రామంలో అనేక సమస్యలు ఉన్నాయన్నారు. తాగునీటి పైపులైన్ల మరమ్మతులతో పాటు కల్వర్టులు, కాలువలు శిథిలావస్థకు చేరుకున్నాయని తెలిపారు. స్పందించిన ఈవోపీఆర్డీ.. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి, అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. కార్యదర్శులు నీరస రవికుమార్, సూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి మండల సమస్యలు

గరుగుబిల్లి: మండలంలోని ప్రధాన సమస్యలను కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి దృష్టికి తీసుకు వెళ్లినట్టు రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శులు మర్రాపు పురుషోత్తంనాయుడు, అరకు టీడీపీ ప్రతినిధులు ముదిలిబాబు విజయవాంకుశం, రావివలస ఎంపీటీసీ సభ్యులు కోట భరత్‌కుమార్‌లు మంగళవారం తెలిపారు. ఈ సమస్యలను ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, నీటి పారుదల శాఖ మంత్రి దృష్టికి తీసుకెళతానని ఎమ్మెల్యే చెప్పారన్నారు. కురుపాం నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి సీఎం చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో పవన్ ఫొటో పెట్టాలి

సీతంపేట: మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్ చిత్రపటాలు ఏర్పాటు చేయాలని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు మండంగి విశ్వనాథం కోరారు. స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు మౌఖిక ఆదేశాలు ఇచ్చినా ఇంతవరకు ఏర్పాటు చేయలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్ ఫొటోలను ఏర్పాటు చేయాలన్నారు.

ఏకలవ్య పాఠశాలను కురుపాంలోనే నిర్వహించాలి

కురుపాం: కురుపాం ఏకలవ్య పాఠశాలను కురుపాంలోనే నిర్వహించాలని గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మండంగి శ్రీనివాసరావు కోరారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. కురుపాంలో మంజూరైన ఏకలవ్య పాఠశాల ఇంతవరకు పార్వతీపురంలో నడుస్తుందని, ఇటీవల కురుపాంలో కొత్తగా నిర్మించిన భవనం వైసీపీ ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం రాజన్నదొర ప్రారంభించారని చెప్పారు. అయితే నేటికీ కురుపాంకు పాఠశాల తరలించలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించిన ఏకలవ్య పాఠశాల పూర్తి సదుపాయాలతో పనులు చేపట్టి కురుపాంలో తరగతులు నిర్వహించాలని కోరారు. అలాగే నార్త్ ఇండియన్ నుంచి ఉపాధ్యాయుల కారణంగా అభ్యసనలో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రస్తుతం ఉన్న ప్రిన్సిపాల్‌ను కొనసాగించాలని కోరారు. ఈ సమావేశంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ తోయక ప్రకాష్‌రావు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బస్సును ఢీకొట్టిన కారు



నుజ్జయిన కారు ముందు భాగం

సీతంపేట: ఆర్టీసీ బస్సును వెనుక నుంచి కారు ఢీకొట్టిన ఘటన సీతంపేట, దోనుబాయి జంక్షన్ వద్ద మంగళవారం చోటుచేసుకుంది. సీతంపేట నుంచి కొత్తూరు వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సును అదే మార్గంలో వెళ్తున్న కారు వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. దీంతో కారు ముందు భాగం నుజ్జయింది. ఎదురుగా మేకలు వస్తుండగా బస్సు నెమ్మదిగా వెళ్తుండడంతో.. వెనుక నుంచి వస్తున్న కారు ప్రమాదవశాత్తు ఢీకొట్టింది. ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ఇరువురు అంగీకారంతో రాజీ మార్గంలో ఒప్పందం కుదుర్చుకున్నారు.

నాగావళికి స్వల్ప వరద

గరుగుబిల్లి: తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు పరిధిలోని నాగావళి నదికి మంగళవారం స్వల్ప వరద ప్రవాహం నెలకొంది. పరిసర ప్రాంతాల్లో కొద్దిపాటి వర్షాలు కురవడంతో నదిలోకి 1600 క్యూసెక్కుల వరద ప్రవాహం చేరుతుంది. ప్రాజెక్టులో 105 మీటర్లకు గాను 104.10 మీటర్ల నీటి నిల్వ సామర్థ్యం ఉంది. నదీ మార్గం గుండా దిగువకు 905 క్యూసెక్కులు, ప్రధాన కాలువల నుంచి సాగునీరు అవసరాలకు 610 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టులోకి పైనుంచి ఎంతమేర వరద ప్రవాహం చేరుతుందో దిగువకు ఆ మేరకు విడుదల చేస్తున్నారు. ఒడిశాలో అధికంగా వర్షాలు కురిసినట్లయితే వరద ప్రవాహం పెరిగే అవకాశం ఉందని ప్రాజెక్టు డీఈఈ టి.రఘునాథనాయుడు, జేఈలు కె.శ్రీనివాసరావు, బి.కిషోర్‌కుమార్ తెలిపారు.

ఘనంగా నెక్కంటి జన్మదిన వేడుకలు



రక్తదాన శిబిరం వద్ద నెక్కంటి

రాయగడ: బిజూ జనతాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, పూర్వ రాజ్యసభ సభ్యుడు నెక్కంటి భాస్కరరావు జన్మదిన వేడుకలను మంగళవారం రాయగడలోని ఆయన స్వగృహంలో ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని నలుమూలల నుంచి వచ్చిన కార్యకర్తలు, పలు సంఘాల నాయకులు భాస్కరరావుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించా రు. 110 యూనిట్ల రక్తం సేకరించినట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి.

తెలుగు విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ



విద్యార్థులతో క్లబ్ సభ్యులు, ఉపాధ్యాయులు

రాయగడ: గాంధీనగర్ ప్రాథమిక పాఠశాలలో తెలుగు మాధ్యమంలో చదువుతున్న ఒకటి నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఫ్రెండ్స్ వాకర్స్ క్లబ్ సభ్యులు మంగళవారం పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా క్లబ్ అధ్యక్షుడు లాడి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఒడిశాలో తెలుగు మాధ్యమంలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పర్లాకిమిడి, బరంపురం ఛత్రపూర్‌లలో తెలుగు విద్యార్థులకు తెలుగు పుస్తకాలు సరఫరా చేస్తున్న అధికారులు.. రాయగడను పట్టించుకోవడం లేదన్నారు. ఈ విషయాన్ని హెచ్ఎం ప్రతాప్‌చంద్ర బత్రియ తమ దృష్టికి తీసుకురావడంతో పాఠశాలలోని 80 మంది విద్యార్థులకు తెలుగు పాఠ్యపుస్తకాలు అందజేశామని పేర్కొన్నారు. అలాగే దాత విద్యార్థులకు రూ.15వేలు విలువైన నోట్ పుస్తకాలు, పెన్నులు, తదితర విద్యా సామగ్రిని అందజేశారు. ఈసందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కార్యదర్శి లాడి మృత్యుంజయరావు, కోశాధికారి కె.శ్రీధర్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఒడిశా

నిలువ నీడ కరువాయే..

● బస్‌షెల్టర్ లేక విద్యార్థుల అవస్థలు
● సకాలంలో రాని బస్సులు



పాతబస్టాండ్ కూడలి వద్ద బస్సుల కోసం వేచిఉన్న విద్యార్థులు

పార్వతీపురంటౌన్: చదువుల నిమిత్తం జిల్లా కేంద్రానికి వచ్చిన విద్యార్థులు తిరిగి వారి స్వగ్రామాలకు వెళ్లేందుకు బస్సుల కోసం గంటల కొద్దీ ఎదురు చూడాల్సి వస్తోంది. బస్సుషెల్టర్ లేక ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ నిలబడాల్సి వస్తోంది. జిల్లాలోని కురుపాం, గుమ్మలక్ష్మీపురం, కొమరాడ, వీరఘట్టాం తదితర మండలాలకు చెందిన అనేకమంది విద్యార్థులు జిల్లా కేంద్రంలోని వివిధ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్నారు. వారు ప్రతిరోజూ వ్యయప్రాయాసలతో బస్సులకు వస్తూ ఉంటారు. అయితే తిరిగి తమ స్వగ్రామాలకు వెళ్లేందుకు నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. పార్వతీపురం పట్టణంలో రాయగడ రోడ్డు, పాతబస్టాండ్ కూడళ్ల వద్ద వారు నిలబడేందుకు కనీసం నీడ కరువవుతోంది. బస్సుషెల్టర్ లేకపోవడంతో రహదారి పక్కనే ఎండలో నిలబడాల్సి వస్తోంది. వర్షాకాలం అయితే మరింత ఇబ్బంది పడాల్సి వస్తోంది. వర్షంలో తడుస్తూ బస్సుల కోసం వేచిచూడాల్సి వస్తోంది. ఇదిలా ఉండగా బస్సులు కూడా సమయానికి రావడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బస్సుషెల్టర్ ఏర్పాటు చేసి, తమ సమస్యను పరిష్కరించాలని, అలాగే బస్సులు సకాలంలో వచ్చేలా చూడాలని విద్యార్థులు కోరుతున్నారు.

ఉపాధి వేతనదారులకు 77 శాతం పనిదినాలు



మాట్లాడుతున్న ఏపీడీ శ్రీహరినాయుడు

గరుగుబిల్లి: మండలంలోని ఉపాధి హామీ పథకం వేతనదారులకు 77 శాతం పనిదినాలు కల్పించినట్టు సీతంపేట క్లస్టర్ ఏపీడీ గుంట్రెడ్డి శ్రీహరినాయుడు తెలిపారు. మంగళవారం మండల అభివృద్ధి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గరుగుబిల్లి, వీరఘట్టం, పాలకొండ, భామిని, సీతంపేట మండలాలకు సంబంధించి 41.50 లక్షల పనిదినాలకు 31.50 లక్షల పనిదినాలు మార్చి నెలాఖరుకు పూర్తి చేసినట్టు తెలిపారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున ఉద్యాన పంటల సాగుతో పాటు ఎవెన్యూ ప్లాంటేషన్, బ్లాక్ ప్లాంటేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సామాజిక తనిఖీల్లో అధికంగా రికార్డుల నిర్వహణలో లోపాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. రికార్డుల నిర్వహణపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కొద్ది రోజుల్లో వేతనదారుల ఖాతాల్లోకి మొత్తాలు జమ అవుతాయన్నారు. ఈ సమావేశంలో ఏపీవో ఎం.గౌరీనాథ్, ఈసీ ఎం.హరికృష్ణ, ఎం.అవినాష్, తదితరులు పాల్గొన్నారు.

సెల్ షాపులో చోరీ

కొమరాడ: మండల కేంద్రంలోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి ఎదురుగా ఉన్న సెల్ షాపులో దొంగలు చొరబడ్డారు. మంగళవారం ఉదయం షాపు యజమాని సతీష్ షాపు తెరిచి చూడగా లోపల వస్తువులు చెల్లాచెదురుగా ఉన్నట్లు తెలిపారు. షాపుపై రేకును తొలగించి దొంగలు లోపలికి దిగినట్లు గుర్తించామ న్నారు. షాపులో రూ.25వేలతో పాటు సెల్‌ఫోన్లనను దొంగలు పట్టుకుపోయినట్లు షాపు యజమాని తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నీలకంఠం చెప్పారు.

బోరు విడి భాగాలు..

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బోరుబావుల విడి భాగాలు చోరీకి గురైనట్టు ఎంపీడీవో ఈశ్వరరావు మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వాటి విలువ సుమారు రూ. 85 వేలు ఉంటుందని అంచనా వేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దళితుల దీక్షకు మద్దతు



పెత్తందారులను అరెస్టు చేయాలని కోరుతున్న సంఘ సభ్యులు

పార్వతీపురం టౌన్: శివ్వాం దళితుల భూ సమస్యను పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షకు శ్రామిక మహిళా సంఘం మంగళవారం సంఘీభావం ప్రకటించింది. ఆ సంఘ నాయకులు ఇందిర, ఉమారాణి, లక్ష్మీలు మాట్లాడుతూ దళితుల భూములను లాక్కొని సాగు చేస్తున్న పెత్తందారులను వెంటనే అరెస్టు చేయాలన్నారు. దళితులపై దాడి చేసిన పెత్తందారులపై అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

లైంగిక వేధింపుల నివారణపై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

కురుపాం: పనిచేసే ప్రదేశాల్లో మహిళలకు లైంగిక వేధింపుల నుంచి రక్షించుకోవడానికి అవగాహన అవసరమని కురుపాం ఐసీడీఎస్ పీవో కె.విజయగౌరి అన్నారు. ఈ మేరకు మంగళవారం కురుపాం ఐసీడీఎస్ ప్రాజెక్టు స్థాయిలో అంగన్‌వాడీ కార్యకర్తలకు సమావేశం నిర్వహించారు. పనిచేసే ప్రదేశాల్లో మహిళలకు లైంగిక వేధింపుల నుంచి ఏ విధంగా కాపాడుకోవాలనే అంశంపై ఆమె అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాల ఉన్నట్టా.. లేనట్టా?

● ఎనిమిది రోజులుగా కానరాని ఉపాధ్యాయుడు

జియ్యమ్మవలస: తమ గ్రామంలో పాఠశాల ఉన్నట్టా.. లేనట్టా.. అని డంగభద్ర గదబవలస గిరిజనులు విద్యాశాఖను ప్రశ్నిస్తున్నారు. దీనికి కారణం ఆ పాఠశాలకు గత ఎనిమిది రోజులుగా ఉపాధ్యాయుడు వెళ్లకపోవడమే. దీనిపై సమగ్ర దర్యాప్తు జరిపి తగు న్యాయం చేయాలని వీరు ఐటీడీఏ అధికారులను డిమాండ్ చేస్తున్నారు. ఈ ప్రాథమిక పాఠశాలలో 16 మంది విద్యార్థులు ఉన్నారు. అయితే ఈనెల 13వ తేదీ నుంచి ఇక్కడికి ఉపాధ్యాయుడే రావడం లేదు. ఈ పాఠశాల విషయం తెలుసుకున్న మండల విద్యాశాఖాధికారులు ఎస్.నాగభూషణరావు, ఎం.శ్రీనివాసరావులు మంగళవారం గెడ్డతిరువాడ పంచాయతీ చిలకలవానివలస గ్రామ పాఠశాల నుంచి ఎంటీఎస్ ఉపాధ్యాయుడు బడే శ్రీనివాసరావును పంపించారు. ఆయన ఉదయం 11.30 గంటలకు పాఠశాలకు చేరుకుని విద్యా బోధన చేశారు. అయితే తమకు పూర్తిస్థాయిలో ఉపాధ్యాయుడిని నియమించాలని ఆ గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

ఉపాధ్యాయుల కొరత వల్లే..

తమ పాఠశాలలో ముగ్గురు రెగ్యులర్ ఉపాధ్యాయులమే ఉన్నాం. మేము ఎనిమిది తరగతులను నిర్వహించాల్సి ఉంది. సీఆర్టీలు ఇంకా విధుల్లోకి రాలేదు. అందుకు తమ పాఠశాల నుంచి డిప్యుటేషన్‌పై డంగభద్రవలస జీపీఎస్ (టీడబ్ల్యూ)కు ఉపాధ్యాయులను పంపించలేకపోయాం.

\- అల్లు రవిప్రసాద్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం, టీడబ్ల్యూఏహెచ్ స్కూల్, వనజ

అక్రమ లేఅవుట్లలో రాళ్లు తొలగింపు



అక్రమ లేఅవుట్లలో రహదారులను తవ్వుతున్న దృశ్యం

పార్వతీపురంటౌన్: పట్టణంలోని రెండో సచివాలయం పరిధిలోగల సౌందర్య నారాయణమూర్తినగర్ వెనుకన ప్రభుత్వ అనుమతులు లేకుండా వేసిన అక్రమ లేఅవుట్లలో సరిహద్దు రాళ్లను తొలగించినట్టు పట్టణ ప్రణాళిక విభాగం అధికారి కనకరావు తెలిపారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు పురపాలక చట్టం-1965 నిబంధనలను అనుసరించి అక్రమ లేఅవుట్లపై చర్యలు చేపట్టామని చెప్పారు. లేఅవుట్‌లో రహదారులను ప్రొక్లయినర్‌తో తవ్వించామన్నారు. మున్సిపల్ చట్టం, నిబంధనలకు లోబడి లేఅవుట్లు ఏర్పాటు చేయకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జనసేన సభ్యత్వాన్ని వినియోగించుకోండి



సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్న దృశ్యం

గుమ్మలక్ష్మీపురం: కురుపాం నియోజకవర్గంలో జనసేన పార్టీ నాలుగో విడత సభ్యత్వ నమోదు కార్యక్రమం చురుగ్గా సాగుతోందని నియోజకవర్గ ఇన్‌చార్జి కద్రక మల్లేశ్వరరావు తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ప్రతిఒక్కరూ జనసేన సభ్యత్వాన్ని వినియోగించుకోవాలని కోరారు. జనసేన నాయకులు అధికారి అనీల్, రాజా, యువరాజు, రాంబాబు, బుద్దేష్, తాడేల శ్రీరాం పాల్గొన్నారు.

పిచ్చిమొక్కలు తొలగించరూ..



కాలువలో పిచ్చిమొక్కలు తొలగించని దృశ్యం

వీరఘట్టం: తోటపల్లి ఎడమ కాలువ రైతులకు ఎంతగానో ఉపయోగపడే సాగునీరు వనరులు, కాలువ ఆధునికీకరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. కాలువలో కనీసం సాగునీటి విడుదలకు ముందైనా పిచ్చి మొక్కలను తొలగించలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువలోని మొక్కలను తొలగించి సాగునీరు సక్రమంగా అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

అరకొర పనులతో అసౌకర్యం

● అధ్వానంగా పార్వతీపురం-పాలకొండ రోడ్డు



ఉల్లిభద్ర ప్రాంతంలో బురదమయంగా మారిన దృశ్యం

గరుగుబిల్లి: పార్వతీపురం నుంచి పాలకొండ వైపు వెళ్లే ప్రధాన రహదారి మార్గంలో అరకొర పనుల నిర్వహణతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. అడ్డాపు శీల రహదారి నుంచి ఉల్లిభద్ర వరకు ఉన్న ప్రధాన రహదారి మార్గం అడుగడుగునా భారీ గుంతలతో దర్శనమిస్తోంది. ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారుల దుస్థితిపై మంగళవారం ఆంధ్రజ్యోతిలో రోడ్లు బాగుపడేదెప్పుడు శీర్షికన కథనం వెలువడింది. దీనిపై స్పందించిన ఆర్అండ్‌బీ శాఖ అధికారులు స్పందించి ఉల్లిభద్ర ప్రాంతంలో మట్టి రాళ్లు వేసి కొంతమేర గోతులను పూడ్చారు. అయితే వేసిన మట్టి వర్షాలకు బురదమయంగా తయారై వాహనాలు జారిపడుతున్న పరిస్థితి ఏర్పడింది. మరమ్మతులు చేపట్టే ముందు శాశ్వతంగా ఉండేలా చర్యలు చేపట్టాల్సి ఉన్నా తూతూ మంత్రంగా గుంతలను పూడ్చడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అడ్డాపుశీల ప్రాంతంలో రహదారికి ఇరువైపులా భారీ స్థాయిలో గోతులు ఉన్నా స్పందించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వర్షా కాలంలో వాహనదారులకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు

గరుగుబిల్లి: గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నారు. పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా మంగళవారం వివిధ గ్రామాల్లో ఎంపీడీవో పి.సూర్యనారాయణ, ఈవోపీఆర్డీ ఎల్.గోపాలరావు, పంచాయతీ కార్యదర్శులు అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గొట్టివలస సర్పంచ్ బి.చంద్రినాయుడు, కార్యదర్శి టి.భాస్కరరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు



చిదిమి జంక్షన్ వద్ద కల్వర్టును పరిశీలిస్తున్న డీఎస్పీ

వీరఘట్టం: మండలంలోని చిదిమి జంక్షన్ వద్ద కొద్ది రోజుల క్రితం లారీ అదుపు తప్పి రైలింగ్‌ను ఢీకొట్టింది. దీనితో కల్వర్టు వద్ద రైలింగ్ లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది. మంగళవారం పాలకొండ డీఎస్పీ జి.వి.కృష్ణారావు ఆ ప్రదేశాన్ని పరిశీలించారు. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా స్టాపర్స్, డ్రమ్స్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

రాష్ట్రానికి ప్రాధాన్యం ఇవ్వడం హర్షణీయం

గరుగుబిల్లి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి తగిన ప్రాధాన్యత ఇవ్వడం అభినందనీయమని టీడీపీ మండల అధ్యక్షులు అక్కేన మధుసూదనరావు, సంతోషపురం సర్పంచ్ అంబటి తవిటినాయుడు హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర బడ్జెట్‌లో ముఖ్యమంత్రి సూచించిన మేరకు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించారన్నారు. రాష్ట్ర రాజధాని అమరావతికి రూ.15వేల కోట్లు ప్రకటించడంతో పాటు వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీలు ప్రకటించడం హర్షణీయం అన్నారు.

రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేలా కేంద్ర బడ్జెట్

జియ్యమ్మవలస: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు రాష్ట్రాభివృద్ధికి చేస్తున్న కృషి ఫలించిందని, అందుకే కేంద్ర బడ్జెట్ 2024-25లో రాష్ట్రాభివృద్ధికి సముచిత స్థానం లభించిందని కురుపాం నియోజకవర్గ జనసేన ఐటీ కోఆర్డినేటర్ ఎల్.రంజిత్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ బడ్జెట్‌లో నిరుపేదలు, రైతులు, పారిశ్రామిక రంగం, మహిళా సాధికారతకు పెద్దపీట వేశారన్నారు.

పేదల అభివృద్ధికి ప్రాధాన్యం

వీరఘట్టం: కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇచ్చేదిగా ఉందని బీజేపీ నాయకులు గుణుపూరు వెంకటనాయుడు తెలిపారు. మన రాష్ట్రానికి అధిక నిధులు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా..

డిగ్రీ కళాశాలను సందర్శించిన నాక్ బృందం

పాలకొండ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను నాక్ బృందం మంగళవారం పరిశీలించింది. ప్రిన్సిపాల్ శ్యాంబాబు కళాశాలకు సంబంధించి పరిపాలనాపరమైన విషయాలను వివరించారు. ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ బి.ఆర్.రాజు ఏడు అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. అనంతరం బృందం కళాశాలలోని వివిధ విభాగాలు, క్యాంటీన్, గ్రంథాలయం, బాలికల వెయింటింగ్ హాల్, మైదానాన్ని పరిశీలించారు. తల్లిదండ్రుల సమావేశాన్ని, విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

పాలకొండ: పరిశుభ్రతతోనే ఆరోగ్యమని ఎంపీడీవో శంబంగి రామకృష్ణ, ఈవోఆర్డీ సూర్యనారాయణ పేర్కొన్నారు. కొండాపురం పంచాయతీలో జరుగుతున్న పారిశుధ్య పక్షోత్సవాలను మంగళవారం పరిశీలించారు. అనంతరం సచివాలయాన్ని సందర్శించి సిబ్బంది హాజరు పరిశీలించారు. సమయపాలన పాటించాలన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

సీతంపేట: గిరిజన విద్యార్థుల ఆరోగ్యం పట్ల పాఠశాల సిబ్బంది జాగ్రత్త వహించాలని ఐటీడీఏ ఉపవిద్యాశాఖాధికారి పాలక నారాయుడు స్పష్టం చేశారు. మంగళవారం చిన్నబగ్గ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. అన్ని తరగతులకు పాఠ్యాంశాలు బోధించడంపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

వాహనాలకు బహిరంగ వేలం

పాలకొండ: పాలకొండ పోలీస్‌స్టేషన్‌లో ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈనెల 25న వేలం వేయనున్నట్టు పాలకొండ పోలీస్‌స్టేషన్ హౌస్ ఆఫీసర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 8 ద్విచక్ర వాహనాలు, ఒక కారు బహిరంగ వేలం వేయనున్నట్టు చెప్పారు. ఆసక్తిఉన్నవారు వేలంలో పాల్గొనవచ్చన్నారు.

పాలవలసలో వైద్య శిబిరం

భామిని: పాలవలస గ్రామంలో బత్తిలి పీహెచ్‌సీ వైద్యాధికారి దామోదర్ ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఇంటింటా జ్వరాలపై ఆరా తీశారు. దోమతెరలను వినియోగించాలని సూచించారు. ఈవోపీఆర్డీ కృష్ణారావు, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ అప్పారావు ఆధ్వర్యంలో కారిగూడ, పోలవరం గ్రామాల్లో ఇంటింటా దోమల నివారణకు స్ప్రేయింగ్ చేశారు. అలాగే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని గ్రామస్థులకు సూచించారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి

పార్వతీపురంటౌన్: పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించినట్టు మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. పారిశుధ్య పక్షోత్సవాల్లో భాగంగా 5, 6, 15, 16, 23, 24 వార్డుల్లో చేపడుతున్న పారిశుధ్య పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. వర్షాకాలంలో ప్రజలు అనారోగ్యాల బారిన పడకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని చెప్పారు. అలాగే స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తున్నామన్నారు.



పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసరావు



కరుణ లేకపోయె!

● గత ఐదేళ్లుగా జాడలేని ఉపాధి కల్పన ● అలంకారప్రాయంగా కార్పొరేషన్లు ● నిరుద్యోగుల ఎదురుచూపులు ● కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

రాజాం, జూలై 23:

● రాజాంకు చెందిన శ్రీనివాసరావు స్వయం ఉపాధి పొందేందుకు కొన్నేళ్ల కిందట బీసీ కార్పొరేషన్ రుణం కోసం దరఖాస్తు చేసుకున్నాడు. రుణం వస్తే దుకాణం ఏర్పాటుచేసుకోవాలని భావించాడు. ఐదేళ్లు గడిచిపోయినా అతిగతీ లేదు. దీంతో స్థానిక పరిశ్రమలో రోజువారి కూలీగా చేరిపోయాడు.

● రాజాంకు చెందిన మరో యువకుడు పైడిరాజు ఆటో కోసం కార్పొరేషన్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. 2019 ఫిబ్రవరిలో ఇంటర్వ్యూలు సైతం పూర్తయ్యాయి. కానీ రుణం అందలేదు. రుణంపై ఆశలు వదులుకున్న పైడిరాజు ప్రత్యామ్నాయ ఉపాధి చూసుకున్నాడు.

గత ఐదు సంవత్సరాల్లో వైసీపీ పాలనలో పరిస్థితి ఇది. రాష్ట్రంలో వివిధ కార్పొరేషన్ల ద్వారా మంజూరయ్యే రాయితీ రుణ పథకాలు నిలిచిపోయాయి. వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఈ స్తబ్ధత ఏర్పడింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 16 కార్పొరేషన్లు ఉండగా..వైసీపీ ప్రభుత్వం 80కి పెంచింది. సామాజికవర్గానికి ఒక కార్పొరేషన్‌ను ఏర్పాటుచేసింది. చైర్మన్‌తో పాటు సభ్యులను నియమించింది. అంతవరకూ బాగానే ఉంది కానీ ఆయా సామాజికవర్గాల సంక్షేమానికి కానీ..నిరుద్యోగ యువతకు కాని రుణ పథకాలు మాత్రం ప్రకటించడం లేదు. గతంలో సంక్షేమ శాఖలు ప్రకటించే వార్షిక ప్రణాళికల కోసం నిరుద్యోగ యువత ఎదురుచూసేవారు. వెనుకబడిన తరగతుల వారి సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కులాల వారీ ఏర్పాటు చేసుకునే సంఘాల (ఫెడరేషన్లు)కు 50 శాతం సబ్సిడీతో కూడిన గ్రూపు రుణాలను అందించేవారు. గరిష్ఠంగా రూ. 30 లక్షల వరకూ మంజూరు చేసేవారు. రాష్ట్రంలో ఏటా అన్ని కార్పొరేషన్ల పరంగా రాయితీతో కూడిన యూనిట్ల ఏర్పాటుకు సగటున రూ.150 కోట్లకుపైగా మంజూరయ్యేవి. 2017- 18 ఆర్థిక సంవత్సరం వరకూ రాయితీ రుణాల మంజూరు ప్రక్రియ సక్రమంగానే సాగింది. 2018-19కి సంబంధించి ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు, తదితర కార్పొరేషన్ల పరంగా రూ.150 కోట్ల రుణ లక్ష్యంగా నిర్ణయించి 11 వేలకు పైగా యూనిట్ల ఏర్పాటు కోసం లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఈ ప్రక్రియ ముగిసే సమయానికి సార్వత్రిక ఎన్నికల నియమావళి అమల్లోకి రావడంతో రుణాలు మంజూరు కాలేదు. ఎన్నికలు పూర్తయిన తరువాత ఆ రుణాల గురించే వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు.

త్వరలో రుణాలు వచ్చే అవకాశం

ప్రభుత్వం ఇటీవలే కొలువుతీరింది. త్వరలో మళ్లీ కార్పొరేషన్ల ఆధ్వర్యంలో రుణాలు ఇచ్చే అవకాశం ఉంది. దీనిపై అధికారికంగా ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదు. ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటాం.

-పెంటారావు, ఏడీ, బీసీ కార్పొరేషన్, విజయనగరం



శాకంబరిగా దాడితల్లి



బొబ్బిలి: పట్టణంలోని గొల్లపల్లి బైపాస్ జంక్షన్‌లో గల శ్రీదాడితల్లి అమ్మ వారికి మంగళవారం శాకంబరిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మ వారికి పండ్లు, కూరగాయలతో అలంకరించారు. పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

నిధుల కేటాయింపుపై హర్షం

లక్కవరపుకోట: అప్పుల ఊబిలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు నిధులు కేటాయించిన ఎన్డీఏ ప్రభుత్వానికి మండల టీడీపీ నేతలు, మాజీ జడ్పీటీసీ కరెడ్ల ఈశ్వరరావు, మాజీ ఎంపీపీ కొల్లు రమణమూర్తి, మండల పార్టీ అధ్యక్షుడు చొక్కాకుల మల్లునాయుడు కృతజ్ఞతలు తెలిపారు. రాజధాని నిర్మాణానికి రూ.15వేల కోట్లు, పోలవరం నిర్మాణానికి సాయం, విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్‌కి సాయం, వెనుకబడిన జిల్లాల నిధులు ఇలా అన్ని విధాలా సాయం అందిస్తామని ప్రకటించినందుకు హర్షం వ్యక్తం చేశారు.

కౌలురైతుల రుణాలపై చర్చిస్తున్నాం

లక్కవరపుకోట: ఖరీఫ్‌లో కౌలురైతులకు ఇచ్చిన కార్డులపై బ్యాంకులు రుణాలు ఇచ్చే విధంగావారితో చర్చిస్తున్నామని తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు. ప్రభుత్వం కూడా కౌలు రైతుల సాయం కోసం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రైతులకు నిరంతర సేవలు అందించేందుకు రెవెన్యూశాఖ సిద్ధంగా ఉందన్నారు. రైతులకు ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే తమ కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు.

రేపు నేత్ర పరీక్షలు

తెర్లాం: మండలంలోని పెరుమాళి పీహెచ్‌సీలో ఈ నెల 25న వైద్యాధికారి పర్యవేక్షణలో నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్నట్టు పీహెచ్‌సీ వైద్యాధికారి వెంకటేష్ తెలిపారు. ఉదయం 9 నుంచి 12 గంటల మధ్య దృష్టి సమస్యలు, కంటి శుక్లాలు ఉన్నవారిని పీహెచ్‌సీకి పంపించాలన్నారు. బీపీ, షుగర్ మందులు వాడుతున్నవారు తప్పనిసరిగా మందులు తీసుకుని రావాలని, ఆపరేషన్లకు ఎంపికైనవారిని వెంటనే పుష్పగిరి కంటి ఆసుపత్రికి తరలిస్తామన్నారు.

స్వాతంత్ర్య సమరయోధులకు నివాళి

విజయనగరం రింగురోడ్డు: తమన్నా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం గుండాలపేట గ్రామంలో స్వాతంత్ర్య సమరయోధులు చంద్రశేఖర్ అజాద్, లోకమాన్య తిలక్‌లకు ఘనంగా నివాళులు అర్పించారు. ముందుగా ఆ చిత్రపటాలకు పూలమాల వేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు బొడ్డేపల్లి రామకృష్ణారావు మాట్లాడుతూ, దేశ ప్రజలు వీరి త్యాగాలను ఎన్నటికీ మరువలేనివని కొనియాడారు. ప్రధానోపాధ్యాయుడు నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలి

విజయనగరం రింగురోడ్డు: ప్రభుత్వ రంగ సంస్థ కెనారా బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని విజయవాడ సర్కిల్ కార్యాలయం జనరల్ మేనేజర్ పి.రవి వర్మ కోరారు. మంగళవారం అంబేడ్కర్ కూడలి వద్ద కెనరా బ్యాంకు ప్రాంతీయ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాతాదారులకు కెనారా బ్యాంకు సేవలు మరింత విస్తృతం చేస్తున్నామన్నారు. రైతులకు వ్యవసాయ రుణాలకు ప్రాధాన్యం ఇస్తామని వివరించారు. ప్రధానంగా మహిళలకు, కొత్తగా వ్యాపారం ప్రారంభించే వారికి ముద్ర యోజన తదితర పథకాలను అందజేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏజీఎం కె.వినోద్, బ్యాంకు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల పనిదినాల్లో శిక్షణ వద్దు

బొబ్బిలి: జిల్లాలోని అన్ని యాజమాన్యాలకింద గల హైస్కూళ్ళ హెచ్‌ఎంలకు పాఠశాల పనిదినాల్లో పదిరోజుల టీచ్ టూల్ శిక్షణ ఇవ్వడం సరికాదని ఏపీటీఎఫ్ నేత బంకురు జోగినాయుడు అభ్యంతరం తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఫార్మేటివ్ పరీక్షలు జరిగేముందు ఎస్‌ఈపీపై జాతీయ శిక్షా సప్తాహ్ పేరుతో కార్యక్రమాలు నిర్వహించడం వ్యర్థమన్నారు. ఇలా మొత్తం 17 రోజులు విద్యార్థుల హక్కులకు భంగం కలుగుతుందన్నారు. 117 జీవోని రద్దు చేస్తామన్న హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

బ్యాంకర్లు సహకారం అందించాలి

● డీఆర్‌డీఏ పీడీ కల్యాణచక్రవర్తి

బొబ్బిలి: ప్రభుత్వ పథకాల అమలుకు సంబంధించి బ్యాంకు అధికారులు సంపూర్ణ సహకారం అందించాలని డీఆర్‌డీఏ పీడీ కల్యాణచక్రవర్తి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రమణమూర్తి ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలకు సంబంధించి నూరు శాతం లక్ష్యాలు సాధించాలన్నారు. కస్టమర్ సర్వీసు కేంద్రాల పనితీరుపై సరైన పర్యవేక్షణ ఉండాలన్నారు. కౌలు రైతు గుర్తింపు కార్డులు కలిగిన వారందరికీ బ్యాంకులు రుణాలందించాలని పీడీ తెలిపారు. ఈ సమావేశంలో నాబార్డు ఏజీఎం నాగార్జున, మెప్మా పీడీ సుధాకర్, వ్యవసాయశాఖ ఇన్‌చార్జి ఏడీ మజ్జి శ్యామ్ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

● జిల్లాలో 40,400 డ్వాక్రా సంఘాలున్నాయని ఆ సభ్యులు తమ రుణవాయిదాల చెల్లింపుల్లో ఎటువంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా పారదర్శకత పాటిస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ కళ్యాణచక్రవర్తి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సంఘాలకు ఇచ్చిన పేటీఎం యంత్రాల ద్వారా చెల్లింపులు జరుపుకోవాలని నిర్దేశించామన్నారు. ఈ ఏడాది అర్హత సాధించిన 29,180 సంఘాలకు 1357 కోట్ల రుణాలను అందించాలన్నది లక్ష్యమని



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ కల్యాణచక్రవరి

అందులో ఇంతవరకు 120 కోట్లు రుణవితరణ జరిగిందన్నారు. స్త్రీ నిధి కింద 120 కోట్ల రుణాల లక్ష్యానికి గాను ఇంతవరకు 39. 4 కోట్లు ఇచ్చామన్నారు. జీవనోపాధి కోసం రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బాగా పనిచేస్తున్న సంఘాల ద్వారా షాపింగ్ మాల్స్, కోళ్లఫారాలు, ఫంక్షన్ హాళ్లు వంటివి ఏర్పాటు చేసే ప్రతిపాదన ఉందన్నారు. సంఘాలు చేసుకున్న పొదుపు మొత్తం 600 కోట్ల రూపాయల నిల్వ ఉందన్నారు. ఆ మొత్తంలో తక్కువ వడ్డీకి సభ్యులకు రుణాలిస్తారన్నారు. పీఎంజీఎస్‌వై పథకంలో 1126 మందికి 27.8 కోట్ల రూపాయల రుణాలిచ్చామన్నారు. జిల్లాలో 140 మంది సీసీ లు పనిచేస్తున్నట్లు పీడీ తెలిపారు.

అనర్హులకు పింఛన్లపై విచారణ

రామభద్రపురం, జూలై 23: గత ప్రభుత్వ హయాంలో అనర్హులకు కూడా పింఛన్లు మంజూరు చేశారన్న దానిపై తెలుగుదేశం నాయకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం అధికారులు విచారణ చేపట్టారు. శిష్టు సీతారాంపురం గ్రామంలో ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న వారి తల్లిదండ్రులకు, వైకల్య శాతం తక్కువ ఉన్నవారికి పింఛన్లు మంజూరు కావడంపై ఈవోపీఆర్‌డీ రమణ, మండల విద్యాశాఖాధికారి ఆమిటి తిరుమల ప్రసాద్‌లు పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. పింఛన్లు పొందుతున్న వారి ధ్రువపత్రాలు పరిశీలించి వారి అభిప్రాయాలను నమోదు చేశారు. అర్హులకు మాత్రమే పింఛన్లు ఉండాలని ఫిర్యాదు చేసినట్టు సర్పంచ్ ప్రతినిధి కర్రోతు వెంకన్న తెలిపారు. వైసీపీకి చెందిన కొంతమంది నాయకులు స్పందించి.. టీడీపీకి చెందిన వారిలో కూడా కొంతమంది అనర్హులు ఉన్నట్టు ఫిర్యాదు చేయడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు. నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని విచారణ అధికారులు తెలిపారు. ఈ విచారణలో ఉపసర్పంచ్ కర్రోతు అప్పలనాయుడు, గ్రామ కార్యదర్శి మహిళా పోలీసు తదితరులు పాల్గొన్నారు.



విచారణ చేస్తున్న దృశ్యం

పొదుపు సంఘాలకు రూ.114 కోట్ల రుణాలు లక్ష్యం

బొబ్బిలి, జూలై 23: జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో 2854 స్వయంసహాయక పొదుపు సంఘాలకు రూ.114 కోట్లు బ్యాంకు లింకేజీ రుణాలను అందివ్వాలన్నది లక్ష్యంగా నిర్ణయించినట్లు మెప్మా పీడీ బి.సుధాకర్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. గత ఏడాది 4,600 గ్రూపులకు 395 కోట్ల రుపాయల రుణాలిచ్చామన్నారు. ఇంత మొత్తంలో ఇస్తున్న రుణాలన్నీ ఏమేరకు సద్వినియోగం అవుతున్నాయన్న దానిపై మైక్రో క్రెడిట్ ప్లాన్ (ఎంసీపీ) ద్వారా ప్రత్యేక పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. పొదుపు సంఘాలకు ఇచ్చే రుణాల్లో నేరుగా ప్రతి లబ్ధిదారుకీ అందుతున్నదీ లేనిదీ ఆరా తీస్తామన్నారు. రుణపంపిణీలో ఎటువంటి అవకతవకలు లేకుండా నిఘా పెడుతున్నామన్నారు. బ్యాంకులే నేరుగా సంఘాలతో డాక్యుమెంటేషన్ చేయించుకునేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఆర్పీల ప్రమేయం లేకుండా చేశామన్నారు. ప్రతి సంఘానికి 20 లక్షల రూపాయల వరకు రుణం అందజేస్తున్నామన్నారు. రుణాల రికవరీ రేటు 99.7 శాతంగా ఉండడంతో బ్యాంకుల నుంచి రుణవితరణ బాగుందన్నారు. పీఎం స్వనిధి కింద వీధి వ్యాపారులకు మూడు దశల్లో ఒక్కొక్కరికీ పది వేల నుంచి 30 వేలు ఆపైన రుణాలిస్తున్నట్లు తెలిపారు. ఈ రుణాలపై 7 శాతం వడ్డీని ప్రభుత్వం రీఎంబర్స్‌మెంట్ చేస్తుందన్నారు. ఈ విధంగా 14,491 మందికి మూడు కోట్ల రూపాయల రుణాలిచ్చామన్నారు. జిల్లాలోని 8,230 సంఘాలు ఉండగా వాటికి వందకోట్ల రూపాయల కార్పస్ ఫండ్ ఉందని సుధాకర్ వివరించారు. పట్టణ సంఘాలకు కూడా స్త్రీనిధి రుణాలు మంజూరు చేయాలని కోరినట్లు ఆయన తెలిపారు.



బి.సుధాకర్, మెప్మా పీడీ

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

తెర్లాం, జూలై 23: మండలంలోని కుమ్మరిపేట కేజీబీవీ పాఠశాలలో మంగళవారం వైద్యాధికారిణి డి.దివ్యభారతి విద్యార్థినులకు ఆరోగ్య తనిఖీలు నిర్వ హించారు. ఈ సందర్భంగా ఇద్దరు విద్యార్థినులు జ్వరంతో బాధపడుతుండడంతో వారికి రక్తపరీక్షలు నిర్వహించారు. మలేరియా, డెంగ్యూ వ్యాధులపై అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆదిలక్ష్మి, ఆరోగ్య సిబ్బంది, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

ప్రాథమిక నైపుణ్యాలకు ప్రాధాన్యం

రామభద్రపురం, జూలై 23: విద్యార్థులు అభ్యసన ప్రక్రియలో ప్రాథమిక నైపుణ్యాలైన చదవడం, రాయడానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని నాయుడువలస ప్రాథమిక పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు జేసీరాజు అన్నారు. మంగళవారం పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో నిపుణ్ భారత్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రెడ్డి వేణు, బొప్పె రవికుమార్, శివున్నాయుడు, కృష్ణంనాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

వేపాడ గురుకుల పాఠశాల తనిఖీ

వేపాడ: బక్కునాయుడుపేట గురుకుల పాఠశాలను జిల్లా కో ఆర్డినేటర్ టీఎం ఫ్లోరెన్స్ మంగళవారం తనిఖీ చేశారు. పాఠశాలకు వచ్చిన ఆమె శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని పరిశీలించారు. మధ్యాహ్న భోజనాలను రుచిచూసి సంతృప్తి వ్యక్తం చేశారు. మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉషారాణి, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



భోజనాలు పరిశీలిస్తున్న ఫ్లోరెన్స్

వరిలో జాగ్రత్తలతో అధిక దిగుబడులు

వేపాడ: చిట్టివానిపాలెం తదితర గ్రామాల్లో సబల, ఏపీసీఎన్ఎఫ్ సభ్యులు వరి సాగులో షోయింగ్ విధానం, దీని లాభాలను రైతులకు వివరించారు. ఖర్చుతో పాటు మహిళలపై పని భారం తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సబల ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ శ్రావణి అన్నారు. ప్రకృతి వ్యవసాయం ఆర్‌టీఓ హేమసుందర్, సీఆర్పీ అర్జున్, రైతులు పాల్గొన్నారు.

రామనారాయణంలో ప్రత్యేక పూజలు

విజయనగరం రింగురోడ్డు: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో మంగళవారం రామనారాయణంలోని వేంకటేశ్వర వేద విజ్ఞాన పీఠంలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. టీటీడీ విశ్రాంత పండితులు గణేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వేద విద్యార్థులు, పండితులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని రక్షించేందుకు ఐక్య పోరాటాలు

విజయనగరం దాసన్నపేట, జూలై 23: రాజ్యాంగాన్ని రక్షించేందుకు కలిసొచ్చే శక్తులతో ఉద్యమాలకు సిద్ధం కావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళవారం కేఎల్‌పురంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.లక్ష్మి అధ్యక్షతన జిల్లా ప్లీనరీ సమావేశం జరిగింది. జెండాను పార్టీ కార్యదర్శి వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం మతోన్మాద విధానాలు ముందుకు తీసుకువెళ్లే చర్యలు వేగవంతం చేసిందన్నారు. ఇటీవల ప్రభుత్వ ఉద్యోగులు ఆర్ఎస్ఎస్ కార్యక్రమాల్లో భాగస్వామ్యులు కావచ్చునని జీఓ ఇవ్వడం దీనికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పోలవరం, విశాఖ ఉక్కు కోసం ప్రత్యేక నిధులు లేవన్నారు. ఈ సమావేశంలో సీపీఎం ప్రతినిధులు తమ్మినేని సూర్యనారాయణ, రెడ్డి శంకరరావు, రమణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

కాలానుగుణ వ్యాధులపై అప్రమత్తం

విజయనగరం రింగురోడ్డు, జూలై 23: కాలానుగుణ వ్యాధులకు దోమలే ప్రధాన కారణమని, వాటి నియంత్రణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని నగర పాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు సూచించారు. మంగళవారం కాటవీధి తదితర ప్రాంతాల్లో పర్యటించి ప్రజల్లో అవగాహన కల్పించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ దోమలు వృద్ధి చెందకుండా చూడాలన్నారు. ఖాళీ టైర్లు, కొబ్బరి చిప్పలు, గుంతలు, ఇళ్లల్లో వాడే ఎయిర్ కూలర్లలో నీరు నిల్వ ఉంటే దోమలకు కేంద్రాలుగా నిలు స్తాయన్నారు. వారంలో ఒక రోజు డ్రై డే పాటించాలని ఆయన సూచించారు. ఒక వేళ ఎవరైనా అనారోగ్యానికి గురైతే, సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి తక్షణమే వైద్య సాయం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య పర్యవేక్షకులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలు ఇస్తున్న కమిషనర్ మల్లయ్యానాయుడు

9 వాటర్ ప్లాంట్లు సీజ్

రాజాం/రూరల్: రాజాం పట్టణం, మండలం ప్రాంతాల్లో ఎటువంటి అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న 9 వాటర్‌ప్లాంట్లను తహసీల్దారు కృష్ణంరాజు మంగళవారం సీజ్ చేశారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ అంబేడ్కర్ ఆదేశాల మేరకు తహసీల్దారు, ఆర్‌ఐ సాగర్, వీఆర్‌లో బృందం ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఎటువంటి అనుమతులు లేకుండా ప్రమాణాలను పాటించకుండా వాటర్‌ప్లాంట్లను నడుపుతున్నట్లు గుర్తించారు. మున్సిపల్ పట్టణ పరిధిలో గాయత్రి నగర్, వస్త్రపురి కాలనీ, కొండంపేట, డోలపేట, గ్రామీణ ప్రాంతానికి చెందిన రాజయ్యపేట, బొద్దాం, దోసరి, పొగిరి, జీసీ పల్లెలో అక్రమంగా నిర్వహిస్తున్న ప్లాంట్లను సీజ్ చేసి కేసులు నమోదు చేశారు. వాటర్‌ప్లాంట్ల నిర్వహణకు సంబంధించి ఇటీవల ఆంధ్రజ్యోతిలో ఈ సమస్యపై అనేక కథనాలు ప్రచురితం కావడం విదితమే. దీనిపై అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య

బొబ్బిలి, జూలై 23: అప్పులబాధతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి ఏఎస్‌ఐ గౌడు భాస్కరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని బెస్తవీధికి చెందిన పెరుగు వెంకటరమణ(58) స్థానిక ప్రైవేట్ స్కూలులో గుమస్తాగా పనిచేస్తున్నాడు. వెంకటరమణ తనకుమార్తె వివాహం, ఇతరత్రా ఖర్చుల నిమిత్తం సుమారు పదిలక్షల రూపాయల అప్పులు చేశాడు. వాటిని తీర్చలేక మనస్తాపానికి గురయ్యాడు. సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆ తరువాత ఇంటికొచ్చిన కుమారుడు సాయితేజ చూసి కుటుంబసభ్యుల సహకారంతో హుటాహుటిన బొబ్బిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో అతడిని విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మధ్యాహ్నం మృతిచెందాడు. మృతుని భార్య అరుణజ్యోతి ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టమ్ నిర్వహించి బంధువులకు అప్పగించామన్నారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పారామెడికల్ డిప్లమో కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

అరసవల్లి: ఏపీ స్టేట్ అలైడ్ అండ్ హెల్త్‌కేర్ ప్రొఫెషన్స్ కౌన్సిల్ సెక్రటరీ వారు డిప్లమో పారామెడికల్ కోర్సుల కన్వీనర్ కోటాలో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆగస్టు 6వ తేదీ వరకు ప్రవేశాలకు అవకాశం కల్పించారని తెలిపారు. ఈ కోర్సులకు ఇంటర్ పాసైయినా వారు అర్హులన్నారు. కోర్సు పూర్తి చేసిన వారికి ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. తమ కళాశాలలో కన్వీనర్, మేనేజ్‌మెంట్ కోటా సీట్లు అందుబాటులో ఉన్నా యన్నారు. ఆసక్తి గల విద్యార్థులు అర్హత ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 799501 3422, 7680945357 ఫోన్ నెంబర్లలో లేకుంటే రాగోలు వద్ద జెమ్స్ హాస్పిటల్‌లోని తమ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

పైడిమాంబకు ప్రత్యేక పూజలు





అలంకరణలో అమ్మవారు, హాజరైన భక్తులు

విజయనగరం రూరల్, జూలై 23: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడిమాంబ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. నగరంలోని వివిధ ప్రాంతాల భక్తులు పైడిమాంబను దర్శించుకున్నారు. మంగళవారం అమ్మవారికి ప్రీతిపాత్రమైన రోజు కావడంతో వివిధ రకాల మల్లెలు, గులాబీ పువ్వులతో అలంకరించారు. వివిధ రకాల పండ్లను నైవేద్యంగా సమర్పించారు. సాయంత్రం చదురుగుడి ప్రాంగణంలో పైడిమాంబ ఆధ్యాత్మిక సేవా సంఘం ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఎస్పీని కలిసిన హోంగార్డు అసోయేషన్ ప్రతినిధులు

విజయనగరం క్రైం, జూలై 23: జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఎస్పీ వకుల్ జిందాల్‌ను హోంగార్డుల జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు బంగార్రాజు ఆధ్వర్యంలో ప్రతినిధులు మంగళవారం ఎస్పీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. కో-ఆపరేటివ్ సొసైటీ, హోంగార్డుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు సుశీల, మహేష్, శంకరరావు, గోపాల్, రమణ తదితరులున్నారు. ● జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన వకుల్ జిందాల్‌ను రోడ్డు సేఫ్టీ ఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు మజ్జి అప్పారావు ఆధ్వర్యంలో ప్రతినిధులు మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయలో మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా లో నిర్వహిస్తున్న అవగాహన సదస్సులు, కార్యక్రమాలపై ఎస్పీ వకుల్ జిందాల్ కు వివరించారు. ఎస్పీని కలిసిన వారిలో సైలాడ శ్రీహరిబాబు, తరుణావాంకు శం, కెల్ల ప్రసాద్ తదితరులు ఉన్నారు. ● లోక్‌సత్తా పార్టీ నాయకులు భీశెట్టి బాబ్జీ మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ వకుల్ జిందాల్‌ను మ ర్యాద పూర్వకంగా కలిశారు. సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి సారించి బాధితు లకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో భారీ వాహనాల రాకపోకలు, ఖైనీ, గుట్కాల నియంత్రణకు కృషి చేయాలని కోరారు. ఆయనతో పాటు పార్టీ నాయకులు కృష్ణమూర్తి రాజు, భాస్కర్ తదితరులు ఉన్నారు.



ఎస్పీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న హోంగార్డులు

యంత్రాలతో లాభం

జామి: నారుయంత్రంతో వరి ఉడుపులతో ఆర్థికంగా లాభంతో పాటు పంట దిగు బడులు పెరుగుతాయని జిల్లా వ్యవసాయాధికారి వీటీ రామరావు అన్నారు. మంగళవారం భీమసింగిలో నారు యంత్రంతో చేసిన ఉడుపులను పరిశీలించారు.



నారుమళ్లను పరిశీలిస్తున్న జేడీ

ఆధార్ సేవల నమోదు కేంద్రం పరిశీలన

రాజాం: మండలంలోని బొద్దాంలో మంగళవారం నుంచి నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా ఆధార్ నమోదు కేంద్రాన్ని ఎంపీడీవో శ్రీనివాసరావు పరిశీలించారు. ఆధార్ నమోదు కోసం వచ్చిన వారికి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు, సీరియల్ నమోదు ప్రకారం ఆధార్ కార్డులను పరిశీలించి సవరణలు ఉంటే సరిచేయాలని వారిని గంటల తరబడి కేంద్రాల వద్ద ఉంచవద్దని ఆదేశించారు. అనంతరం ఆగూరు గ్రామ సచివాలయాన్ని సందర్శించారు.

లోక్‌సభ స్పీకర్‌కు ధన్యవాదాలు తెలిపిన కలిశెట్టి

విజయనగరం (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నిధులు కేటాయించినందుకు గాను లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాకు విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం బడ్జెట్ ప్రసంగం అనంతరం పార్లమెంట్ హాలులో స్పీకర్‌ను ఎంపీ కలిశెట్టి ప్రత్యేకంగా కలిసి ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రానికి నిధులు కేటాయించటంతో ప్రజలంతా ఆనందం వ్యక్తం చేశారని ఇలాగే కేంద్రంనుంచి, రాష్ట్రానికి ఆర్థిక తోడ్పాటు అందించాలని కోరామన్నారు.